# 18. శత్రువు

ఆ రోజు గార్డెన్ ఎన్‌క్లేవ్‌లోని ఫ్లాట్లను, వాటిని కొనుకున్న యజమానులకు వాసుదేవ రావుగారు అందజేస్తున్నారు. పురప్రముఖులను కొంతమందిని పిలిచి, ఉదయం కాఫీ ఫలహారాలను ఏర్పాటుచేసి అందరి సమక్షంలోను పన్నెండుమందికి ఫ్లాట్ల తాళాలు యిచ్చారు.

గార్డెన్ ఎన్‌క్లేవ్‌లో ఉన్నవన్నీ మూడు పడకగదులు ఫ్లాట్లే. ఆరు అంతస్తుల ఎన్‌క్లేవ్ చాల బ్రహ్మాండంగా కనిపిస్తుంది.

వాసుదేవరావుగారికి నగరం సమీపంలో ఇరవై ఎకరాల మామిడితోట ఉంది. కొంత భాగంలో చెట్లు కొట్టించి, అన్ని సదుపాయాలతో ఉన్న ఫ్లాట్లను కట్టించారు. నిర్మాణదశలోనే పన్నెండు ఫ్లాట్లు అమ్ముడుపోయాయి. వాటిధర మామూలువారి దృష్టిలో చాల హెచ్చే. కాని, ఆ ధరలు కూడా కొనుక్కున్నారంటే ఏదో విశేషం ఉండే ఉంటుంది.

వాసుదేవరావుగారు గార్డెన్ ఎన్‌క్లేవ్‌ని కట్టించేటప్పుడు చాల జాగ్రత్తలు తీసుకున్నారు. నాసిరకం సామానులేవీ ఉపయోగించలేదు. వెలుతురూ, గాలీ, నీరూ సమృద్ధిగా లభించే ఏర్పాట్లు చేశారు. నగరానికి చాల సమీపంలోనే ఉండడంచేత ఎవరికీ యిబ్బంది కలుగలేదు.

అతిథులందరూ సావకాశంగా ఫలహారాలు సేవించిన తరువాత, వాళ్లకు మొదటి అంతస్తులోని ఫ్లాట్‌లు చూపించారు.

కిందికి దిగివచ్చిన తరువాత, అందరి సమక్షంలోను అతను ఒకపనిచేశారు.

ఫ్లాట్లు నిర్మించిన పనివాళ్ల బృందాన్నొకదానిని పిలిచి, అందులో ఉన్న ఇరవై మందికి కొత్తబట్టలుపెడుతూ కంట్రాక్టరుగారు అన్నారు.

"ఈ ఇరవైమంది నాకు కుడిభుజం వంటివాళ్లు. పెద్దపెద్దయింజనీర్లు, చాలమంది సాంకేతిక నిపుణులు పనిచేసినా, వీరి గురించి ఎందుకు చెప్పవలసివచ్చిందంటే - ఈ పదుచు వాళ్లంతా మా గ్రామం నుండి వచ్చారు. వీళ్లను నేను ఎంపికచేసి తెచ్చాను. పునాదుల దగ్గిర నుండి భవనం పూర్తయే వరకు వీళ్లు అహోరాత్రులు పనిచేశారు. నిర్మాణం జరుగుతుంటే నాకు చాల సలహాలిచ్చి, ఒక ఉత్తమ కళాఖండంగా ఈ ఎన్‌క్లేవ్‌ని తీర్చిన ఘనత వీరిదేనని నిస్సంశయంగా చెప్తున్నాను. నగరమేయరుగారు వీరికి ఈ బట్టలను బహూకరించమని కోరుతున్నాను."

ఉత్సవం ముగిసి అందరూ వెళ్లిపోతుంటే జడ్జీగారు వాసుదేవరావుగారిని అడిగారు.

"మరొక భవన నిర్మాణం ఏదేనా...?"

"అవునుసార్! ఒక్క రెండు నెలలలో మరొక ఎన్‌క్లేవ్ నిర్మించాలని నిశ్చయించాను."

"ఆ పక్షంలో ఈ బృందాన్ని విడిచిపెట్టకండి. రెండు నెలలు వీళ్లకు జీతాలిచ్చి పోషించినా

నష్టంలేదు. ఇటువంటి నమ్మకమైన వాళ్లు దొరకడం కష్టం."

"అదేను సార్! నేనూ కోరుతున్నది."

..........................................................................................

ప్రొఫెసర్ రంగారావుగారికి తను చాల ఆసక్తితో నిర్వహిస్తున్న తేనెటీగల పెంపకం గురించి కమలాకర్ చెప్తున్నాడు.

"సార్! మీకు తేనెటీగల గురించి తెలుసనుకుంటాను?"

"ఏదో అంతంత మాత్రమే. చెప్పువింటాను."

"వీటిలో రాణియీగ ముఖ్యమైనది. తరువాత పనిచేసే యీగలు. తేనెపట్టు దానిలో గదుల నిర్మాణం చాల అద్భుతమయిన విషయాలు."

"అవునవును."

"ఈ రెండు రకాల యీగలు కాక డ్రోన్సు అన్నమరో రకం యీగలు కూడా వీటిలో ఉంటాయి. ఇవి రాణియీగతో జతకలుస్తాయి."

"అలాగా!"

"రాణియీగ పట్టునుండి పైకి ఎగురుతుంటే, గాలిలోనే ఈ డ్రోన్స్ దానితో జతకలుస్తాయి. ఎన్నిటితోనైనా అది జతకలిసి, వాటి వీర్యాన్ని జమచేసి చాలకాలం వరకు గుడ్లు పెట్టడానికి ఉపయోగిస్తుంది.

"చాల వింతగా ఉందే!"

"మీకు తెలుసా, ఒక మంచి పట్టు నుండి, ఒక సంవత్సరానికి అయిదు వందల కిలోల బరువుగల తేనె, మైనం మొదలైన వస్తువులు లభిస్తాయని...!"

ప్రొఫెసరుగారు పాలిటిక్సు చెప్తారు. వారికివేవి తెలియవు. గాలిలో ఎగిరే రాణియీగతో కలిసిన డ్రోన్స్ వెంటనే చచ్చిపోతాయని, రాణియీగ రోజుకి ఏభైవేలకుపైగా గుడ్లు పెడుతుందని, రాణియీగ ముసలిదైతే పనిచేసే యీగలు వర్జిన్ రాణియీగలను ప్రత్యేకంగా పెంచుతాయని, వాటిలో అవి దెబ్బలాడుకొని ఒక్కటే మిగులుతుందని, వారికి తెలియదు. పూవుల నుండి యీగలు తెచ్చే మకరందంలో ఎనభైశాతం నీరుంటే, తయారయిన తేనెలో పదహారు శాతమే ఉంటుందని, వారికి తెలియదు. తేనెతీగలు కుడితే చాల ప్రమాదమని మాత్రం వారికి తెలుసు.

కమలాకర్ వాసుదేవరావుగారికి ఒకే ఒక పుత్రుడు. కంట్రాక్టరుగారు ప్లాట్లు కట్టి అమ్మినా, వారు మాత్రం తోటలో చిన్న బంగళా కట్టుకొని ఉంటున్నారు. అది కమలాకర్‌కి తేనెటీగల పెంపకానికి చాల అనుకూలించింది.

ప్రొఫెసరుగారు వెళ్లిపోబోతుంటే, కమలాకర్ వారికో సీసాలో తాను తయారు చేసిన తేనెను బహుకరించాడు. ఒక చెమ్చాలో తేనెవేసి దాని రుచి ఎలా ఉందో చెప్పమన్నాడు.

"చాల అద్భుతంగా ఉంది."

"సార్! ఇది ఏ పువ్వులతేనో మీకు తెలుసా."

"తెలియదోయ్!"

"ఇది కుంకుడుపూలతెనె. అన్ని తేనెలకన్న చాలతీయనైనది."

కుంకుడుకాయలు చేదయితే, వాటితేనె ఇంత మధురంగా ఉంటుందా!

ఆ యేడు మామిళ్లు ఆలస్యంగా పూచాయి.

రెండవ ఎన్‌క్లేవ్ పని ప్రారంభించడానికి రెండు నెలలు వ్యవధి.

తమ గ్రామం నుంచి తెచ్చిన ఇరవైమంది యువకులకు తోటలో టెంట్లువేసి యిచ్చారు. నీటి సదుపాయం కల్పించారు. కుటుంబాలను తెచ్చుకొని వాళ్లు సంవత్సరంబట్టి హాయిగా కాపురం చేస్తున్నారు.

ఉన్నట్లుండి వాసుదేవరావుగారు పనిమీద హైదరాబాదు వెళ్లిపోయారు.

వాళ్లబ్బాయి కమలాకర్ ఉత్తర భారతదేశం ఎద్యుకేషనల్‌టూరు మీద వెళ్లిపోయారు.

వెళ్లిపోయేముందు కంట్రాక్టరు గారు తోటలో టెంట్లు వేసుకున్న తన బృందానికి ఒక నెలజీతం యిచ్చి వెళ్లారు. ఇంకా ఏవైనా అవసరమయితే మేనేజరుని ఏర్పాటు చేయమన్నారు.

కమలాకర్ టూరువెళ్లేముందు నమ్మకమైన పనివాడిని తేనెటీగలను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి వెళ్లాడు.

నెల రోజులు ఇట్టే తిరిగిపోయాయి.

అనుకున్ననాటికి వాసుదేవరావుగారు తిరిగిరాలేకపోయారు.

కమలాకర్ టూరు మరోపదిహేను రోజుల వరకు సాగుతుంది.

రెండవ ఎన్‌క్లేవ్‌కి భూమి పూజ చేయడానికి రెండు రోజులు ముందుగా, హైదరాబాదు నుంచి వాసుదేవరావుగారు ఫ్లైట్‌లో వచ్చారు.

తండ్రి వచ్చిన మరో రెండు గంటలకు కమలాకర్ కూడా టూర్ నుండి తిరిగివచ్చాడు.

స్నానంచేసి స్థిరపడినతరువాత వాసుదేవరావుగారు మేనేజరును పిలిపించారు.

"భూమిపూజకు ఇన్విటేషన్లు కొట్టించారా?"

"కొట్టించాను." అన్నాడు మేనేజరు.

"బాగుంది. ఈ సాయంకాలం నేను స్వయంగా వెళ్లి పెద్దవాళ్లను పిలుచుకువస్తాను. మరి, పురోహితులు, బట్టలు, కేటరింగు..."

"అన్నిటికీ ఏర్పాట్లు చేశాను."

"కాని,..." కంట్రాక్టరుగారు ఇటూ అటూ చూసి అన్నారు. పెంటారావుని కాని, వాళ్ల బృందంలో మరెవరినేనా కాని పిలిపించండి. వాళ్లతోకొన్ని సంగతులు మాట్లాడాలి.

"అదేను సార్..."

"అంటే?"

"మూడు రోజులకింద, ఎవరికీ చెప్పకుండా చెయ్యకుండా వాళ్లందరూ వెళ్లిపోయారు."

కంట్రాక్టరుగారు లేచి నిలబడ్డారు.

"ఏమయింది?"

"తెలీదుసార్!"

"వాళ్లకేమేనాలోటు చేశారా?"

"మీరిచ్చిన జీతాలు పదిహేను రోజులకిందే అయిపోయాయి. వాళ్లకవ్వడానికి నా దగ్గిర సరిపడినంతపైకం లేకపోతే. వాళ్లకోసం మన గోడౌను నుండి పది ధాన్యపు బస్తాలు తీసి బియ్యం ఆడించి వాళ్లకిచ్చాను. తరువాత వాళ్లని కలియడానికి నాకు వ్యవధి చిక్కలేదు. ఇవాళ ఉదయం కబురుపంపుతే టెంట్లు కాళీచేసి అందరూ వెళ్లిపోయారని తెలిసింది."

"చెప్పకుండా వెళ్లిపోడానికేదేనా కారణముందా?"

"వారం రోజుల కింద ఇద్దరు రెండేళ్ల పిల్లలు చనిపోయారు. మరో యిద్దరు పది సంవత్సరాల పిల్లలకి ముణుకులు పట్టేసి నడవలేకపోయారు. హాస్పిటలుకి పరుగెత్తి మందులు తెచ్చుకోడానికి కూడా వాళ్లు యిష్టపడక రాత్రికి రాత్రి వెళ్లిపోయారు."

వాసుదేవరావు గారు మతిపోయి కుర్చీలో కూలబడ్డారు.

కమలాకర్‌కి సాయంకాలం వరకు తేనెటీగల గురించా జ్ఞాపకం రాలేదు. తాను అప్పచెప్పి వెళ్లిన పనివాడికి కబురు పంపి అడిగాడు.

"ఎలాగున్నాయి తేనెటీగలు?"

అతడేమీ బదులు చెప్పలేదు.

"ఏమయింది? ఈ సరికి పట్టునిండా తేనె చేరాలి!"

"అటువంటిదేదీ జరగలేదు." అన్నాడతను నీళ్లు నములుతూ.

"మరేమయింది?"

"ఉన్న ఒక్కరాణియీగ ఈ ఉదయం ఎగిరిపోయింది. పట్టులోని గుడ్లు మాడిపోయాయి. పని ఈగలు రావడంలేదు. ఒక చుక్కకూడా తేనె చేరలేదు."

"ఎందుకిలా అయింది?"

"నాకేం తెలుసు బాబూ!"

కమలాకర్ తెలివి తప్పినంతపనయి మంచంమీద పడ్డాడు.

పురుగుమందు బస్తాలలోకి ఇంకి ధాన్యం పాడయింది. పురుగుమందు కొట్టిన కుంకుళ్లు పూసి విషం కలిసిన మకరందం తెనెటీగలకిచ్చాయి.

శత్రువు మరెవరో కాదు. పురుగుమందు.